హై జాకర్స్

సుంకరి రాంప్రసాద్

"నీ జాతి కోసం, నీ మతం కోసం, నీ ధర్మం కోసం
నీవు ఈ పని చేయక తప్పదు కర్తార్ సింగ్."

ఆ చిన్న గదిలో సంత్ దలీల్ సింగ్ గొంతు మంద్రంగా ధ్వనించింది.

"కాని.... నా ఉద్యోగం" సన్నగా గొణిగాడు కర్తార్ సింగ్.

"మతంకోసం ప్రాణాలనే తృణప్రాయంగా త్యజించిన సంతులు జన్మించిన శిక్కు జాతిలో పుట్టికూడా ఇలా భీరువులా మాట్లాడతావేం బిడ్డా!

"మనం స్థాపించబోయే శిక్కు రాజ్యంకోసం, మన అఖండ ఖలిస్తాన్ కోసం.... నీ ఉద్యోగాన్ని త్యాగం చేయలేవూ?" అన్నాడు సంత్.

రాజైనా, రారాజైనా, మతాధికారి శాసనాన్ని ఉల్లంఘించడానికి వీలులేదట.... ... . ఒకనాడు మధ్య యుగంలో.

కాని ఈనాడు.

ఈ ఇరవై ఒకటవ శతాబ్దంలో కూడా.

పాంచాల సీమలో మతాధికారులు ప్రజలనూ, పాలకులనూ శాసించగలుగుతున్నారు.

ఒక దేశ రాష్ట్రపతి, ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి (ప్రజా సంక్షేమ దృష్టిలో తాము చేసినవి ధర్మమని తెలిసి కూడా)...ఆ మతాధికారుల ముందు మోకరిల్లి క్షమాభిక్షను వేడుకున్నారంటే. ..

ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి, మతాధికారుల ఆజ్ఞపై దేవాలయం ముందు భక్తులు విడిచిన పాదరక్షలను శుభ్రంచేశాడంటే...ఆ జాతిపై ఆ మతాధికారుల ప్రభావం, ప్రాబల్యం యెంత ఉందో స్పష్టంగా తెలుస్తూంది.

అఫ్టరాల్ కర్తార్ సింగ్ ఒక చిన్న ఎయిర్ లైన్ ఆఫీసరు. అతడు ఆ మతాధికారి ఆజ్ఞను శిరసావహించబోతున్నాడంటే అందులో ఆశ్చర్యమేముంది?

తల్పాపై పద్మాసనం వేసుకుని కూర్చున్న సంత్ దలీల్ సింగ్ పాదాలకు భక్తిపూర్వకంగా నమస్కరించి, అతని వద్ద శెలవు తీసుకొని వెళ్ళిపోయాడు కర్తార్ సింగ్.

కర్తార్ సింగ్ ఆ గదిలోనుండి వెళ్ళిపోయిన రెండు నిమిషాల తరువాత ఆ గదిలోనికి ప్రవేశించారు, ముగ్గురు శిక్కు యువకులు.

కాని, శిక్కులకుండాల్సిన, గడ్డాలూ, మీసాలూ వారికి లేవు. నున్నగా షేవ్ చేసుకున్నారు వారు. తలపై శిఖగాని, పగిడీ కాని లేవు. చక్కగా క్రాప్ చేసి ఉంది వారి జుత్తు.

వారిని చూసినవారు యెవరూ వారిని శిక్కులని

ఆయుతారు. వారి వంక సంతృప్తిగా చూశారు సంత్ దలీల్ సింగ్.

"బిడ్డలారా! ఆయన యెవరో మీరు చెప్పగలరా?" గదిగోడకున్న పెద్ద చిత్రపటాన్ని వారికి చూపిస్తూ అడిగాడు దలీల్ సింగ్.

"మ హా రా జ్ గురు గోవింద్ సింగ్! సంత్ జీ" అన్నారు ముగ్గురూ ముక్తకంఠంతో.

వారివంక మెచ్చుకోలుగా చూశారు దలీల్ సింగ్.

"శిక్కు జాతి ధైర్యాన్ని, శౌర్యాన్ని ప్రపంచానికి చాటు చెప్పిన మహారాజ్ ఆయన. శిక్కుల పదవ గురు దేవులు.

ఒకనాడు తన అనుచరుల ధైర్యాన్ని పరీక్షించాలనే కోరిక కల్గింది వారికి.

తన గుడారం ముందు తన అనుచరులందరినీ వరుసగా నిలుచుండమన్నారు. ఒక్కొక్క అనుచరుడు గుడారం లోనికి ప్రవేశిస్తున్నాడు. మరుక్షణం భయంకరమైన ఆర్తనాదం, చావుకేక ఆ గుడారంలోనుండి వినిపించ సాగింది. గుడారంలోనుండి ఒక మూల నేలను తడుపుతూ ఎర్రని, చిక్కని రక్తం పైకి రాసాగింది.

లోపలకు వెళ్ళినవారు యెవరూ పైకి రావటంలేదు. చావుకేకలు వినిపిస్తూనే ఉన్నాయి. రక్తం ప్రవాహంలా కారుతూనే ఉంది.

అయినా.. గుడారం బయటనున్న అనుచరులు చలించ లేదు భీరువుల్లా పారిపోలేదు.

తమ మతంకోసం, తమ గురువాజ్ఞకోసం ఆత్మార్పణ చేయడానికి ముందుకే సాగిపోయారు వారు.

వారు నిజమైన శిక్కులు. ధీరులు.

అయితే గురు గోవింద్ సింగ్ జీ నిజంగా తన అనుచరులను చంపలేదు. కేవలం మేక రక్తాన్ని గుడారం బయటకు ప్రవహింపజేశారు వారు.

ఇప్పుడు చెప్పండి బిడ్డలారా!

వారిలా...మన మతంకోసం....మన అఖండ ఖలిస్తాన్ కోసం మీరు ఆత్మార్పణ చేయడానికైనా సిద్ధంగా ఉన్నారా?" ఆ ముగ్గురివంకా సూటిగా చూస్తూ అన్నాడు దలీల్ సింగ్.

"అఖండ శిఖ్ఖ రాజ్య సంస్థాపనకోసం మా ప్రాణాలను చిరునవ్వుతో అర్పిస్తాం బాబా!" అన్నారు ఆ ముగ్గురూ.

మోకాళ్ళపై వంగి నమస్కరిస్తున్న ఆ ముగ్గురినీ చేయి పైకెత్తి ఆశీర్వదించారు దలీల్ సింగ్.

చిరుగాలికి వారి చేతిలోని తాపళం మెల్లగా కదలింది. విజయగర్వంతో ఒక చిరుహాసం అతడి గుబురు మీసాల మాటున మెరిచి, తటిల్లతలా మాయమయ్యింది.

2

న్యూ ఢిల్లీ...

పాలం ఇంటర్ నేషనల్ ఎయిర్ పోర్టు సందడిగా ఉంది. వివిధ దేశాలకు చెందిన ఎందరో ప్యాసింజర్లు, వారిని ఆహ్వానించడానికి వచ్చిన వ్యక్తులతో లాంజ్ కిక్కిరిసి ఉంది.

ఢిల్లీనుండి వాషింగ్ టన్ వెళ్తున్న ఇండియన్ ఎయిర్ లైన్సువారి పాన్ అమ్ బోయింగ్ విమానం రన్ వే మీద నిలబడి వుంది.

394 మంది ప్రయాణీకులు పట్టే ఎయిర్ బస్ అది.

చెకింగ్ పూర్తి చేసుకున్న ప్యాసెంజర్లు...ఒక్కొక్కరుగా మెట్లు పైకెక్కి విమానంలో ప్రవేశిస్తున్నారు.

ఎంట్రన్స్ వే దగ్గర నిలుచుని, చిరునవ్వుతో వారిని ఆహ్వానిస్తూంది ఎయిర్ హోస్టస్ రంజిత.

పచ్చని పసిమి ఛాయలో మెరిసిపోతూంది ఆమె మేని ఛాయ. సాంప్రదాయకమైన పంజాబీ కుర్తా, పైజామాలలోనుండి నిండయిన ఆమె అవయవాల సొంపులు చూపరులకు కోర్క్యారిస్తున్నాయి.

అన్నిటికన్నా అద్భుతమైనది ఆమె నవ్వు. విడీ విడని ఎర్రని పెదవుల మధ్యనుండి. తెల్లగా దానిమ్మగింజలలా మిల, మిలా మెరుస్తున్న పలువరస. వెన్నెలలాంటి నవ్వు ఆమెది.

మకరందం గ్రోలడానికి వ్రాలిన తుమ్మెద బరువుకు క్రిందకు వంగిన మందార పూరెమ్మలా కొద్దిగా క్రిందకు వ్రాలిన ఎర్రని క్రింద పెదవి తడిగా మెరుస్తూంది.

ఒక్కసారి చూస్తే మరచిపోలేని అందం ఆమెది. గ్రుచ్చి గ్రుచ్చి చూస్తున్నట్లున్న కొందరు ప్యాసెంజర్ల చూపులు ఆమెకు ఇబ్బందికరంగా ఉన్నాయి.

కాని ఉద్యోగ నిర్వహణలో ఇలాంటివన్నీ సహించడం ఆమెకు మామూలైపోయింది. చెరుగని చిరునగవుతో ఆమె ప్రయాణీకులను ఆహ్వానిస్తూనే ఉంది.

వాషింగ్టన్ కు పోయే పాన్ అమ్ బోయింగ్ ఫ్లయిట్ బయలుదేరడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటన వినిపించింది.

ప్రయాణీకుల్లో కొందరకు కొత్తకాయింది.

పైలట్, కో పైలట్ కాక్ పిట్ లోనికి ప్రవేశించారు. కాక్ పిట్ (పైలట్ గది) తలుపులు మూసుకున్నాయి. రేడియో, కమ్యూనికేషన్ పరికరాలు సక్రమంగా

ఉన్నదీ, లేనిదీ టెస్టు చేసుకుంటున్నాడు కోపైలట్.

ఇంజన్, ఫ్యూయల్ అన్నీ సక్రమంగా ఉన్నట్లు గ్రీన్ సిగ్నల్ యివ్వబడింది.

ఇండియన్ ఎయిర్ లైన్స్‌లో ప్రయాణిస్తున్నందుకు ప్రయాణీకులందరికీ కృతజ్ఞతలు తెల్పుతూ, వారు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి.... ఒక ప్రకటన ప్లేన్‌లోని స్టీరియో బాక్సుల గుండా వినిపించింది.

కొందరు ప్రయాణీకులు అప్పుడే సీట్లకున్న బెల్టులను నడుములకు బిగించుకోవడం ప్రారంభించారు.

ఒక్కసారి ప్రయాణీకుల వంక చూసింది ఎయిర్ హోస్టెస్ రంజిత.

సీట్లన్నీ ఫుల్ అయి వున్నాయి.

'మొత్తం 394 మంది వచ్చినట్లే' అనుకుంది ఆమె.

ఫ్లయింగ్‌కు అన్నీ క్లియర్ అయినట్లే. ఇక కొద్ది క్షణాలలో పాన్ అమ్ బోయింగ్ ఎయిర్ బస్ గాలిలోనికి దూసుకుపోతూంది.

సరిగ్గా ఆ క్షణంలో....

రన్‌వే గుండా సర్రున దూసుకుంటూ వచ్చి బోయింగ్ విమానం ప్రక్కనే ఆగిందొక వ్యాను.

లేత నీలం, తెలుపు రంగులలో వుంది ఆ వ్యాను. వ్యాన్ ముందు భాగంలోనూ, వ్యాన్ టాప్ మీద కొన్ని లైట్లు ఒక ప్రత్యేక పద్ధతిలో అమర్చి వున్నాయి. వ్యాన్ అద్దంపై ఇండియన్ ఎయిర్‌లైన్స్ వారి స్టిక్కర్ అంటించి వుంది.

చూడగానే అది ఇండియన్ ఎయిర్‌లైన్స్ వారి వ్యాన్ అని సులువుగా పోల్చుకోవచ్చు.

వ్యాను ఆగిన వెంటనే, దానిలోనుండి ముగ్గురు స్ఫుర

డ్రాపులు ఘటాలున క్రిందకు దిగారు.

వారి వంక ఆశ్చర్యంగా చూసింది రంజిత్.

ఎయిర్ ఫోర్స్ భద్రతా సిబ్బందికి చెందిన మనుషుల్లా వున్నారు వారు. వారు ధరించిన దుస్తులు, భుజాలపై, గుండెలపై వున్న లేబిల్స్....అన్నీ వారి హోదాను తెలియజేస్తున్నాయి.

'ఫ్లయిట్ బయలుదేరుతున్న ఈ చివరి నిమిషంలో... ఆకస్మాత్తుగా ఈ సెక్యూరిటీ ఫోర్స్ విజిట్ ఏమిటో.. ఎందుకో అర్థం కాలేదు ఆమెకు.

అయితే ఇలాంటి సంఘటనలు ....అసంభవాలేం కాదు. ఎయిర్ లైన్స్‌లో తిరిగేవారికి ఇవి మామూలే.

ఫ్లయిట్ బయలుదేరుతున్న చివరి క్షణంలో ఎవరో విమానాశ్రయ అధికార్లకు ఫోన్ చేస్తారు, 'ఆ విమానంలో బాంబు వుందని' అది నిజం కాకపోవచ్చు. పట్టి ప్రాక్టికల్ జోక్ కావచ్చు.

కాని చూస్తూ, చూస్తూ కొన్ని వందలమంది ప్రాణాలతో రిస్క్ చేయలేం కదా. ఎయిర్ లైన్స్ భద్రతా సిబ్బంది చె కిం గ్ మొదలుపెడతారు. తీరా, ఇంత హంగామా చేసే ఆ విమానంలో యే బాంబూ లేదని తేలిన సంఘటనలు ఎన్నో వున్నాయి.

ఫ్లయిట్ యింకో అరగంట ఆలస్యంగా బయలుదేరుతుంది. అంతే!

"బహుశ, అలాంటి ఫోన్ యేదో వచ్చి వుంటుంది" అనుకుంది రంజిత ఆ భద్రతా అధికారులను చూస్తూ.

ఆ ముగ్గురు అధికారులూ టక, టకా మెట్లెక్కి విమానంలోనికి అడుగుపెట్టారు.

అప్పుడు ముడిపడింది ఆమె భృకుటి.

ఆ అధికారులు వేగంగానే యెక్కారు ఆ మెట్లు. కాని, ఆ ఎక్కడంలో ఒక ఈజ్ లేదు. కమాండ్ లేదు. అలవాటువలన రావాల్సిన చురుకుదనం లేదు.

క్రొత్తగా విమానం ఎక్కేవారిలో కనిపించే బెరుకు, తడబాటు కనిపించాయి ఆమెకు. ఎంతో సునితంగా చూస్తే గాని గ్రహించలేరు ఎవరూ.

'ఎంతో సుశిక్షుతులైన అధికార్లలో ఆ తడబాటు ఎందుకు వచ్చింది? ఆమెలో చిన్న అనుమానం చోటు చేసుకుంది.

అప్రయత్నంగానే వారికి విష్ చేసిందామె. వారూ తిరిగి విష్ చేశారు.

అంతే! గతుక్కుమంది ఆమె.

వారు రీ విష్ చేసిన విధానం ఎయిర్ లైన్స్ అధికారులు చేసినట్లు లేదు. ఎవరో మామూలు ప్రయాణీకులు చేసినట్లుగా వుంది.

వారి వంక తీక్షణంగా చూసిందామె.

సాధారణంగా అధికారులలో ఒక రకమైన హుందాతనం తీవి, వారి కదలికలలో హోదా కొట్టవచ్చినట్లు కన్పిస్తాయి.

కాని, వారి ముఖాలలో, కదలికలలో అధికార్లకుండాల్సిన దర్పం కనిపించలేదు ఆమెకు. ఒక రకమైన రఫ్ నెస్, క్రూరత్వం కన్పించాయి.

ఆమె మనస్సు కీడును శంకించింది.

"వారు అధికారులు కారని" ఆమె మనసు ఘోష పెట్టసాగింది.

"అధికారులు కాకుంటే....ఎవరు వారు?" ఆమె ఆలోచిస్తూంది.

అప్పుడు సడన్‌గా తట్టింది ఆమెకు వారు యెవరయి వుంటారో.

"హై....జా....క....ర్స్...!"

ఆ ఆలోచన రాగానే ఆమె భయంతో వణికి పోయింది. గొంతులో తడి ఆరిపోతుంటే అతికష్టంమీద తనను తాను కంట్రోల్ చేసుకొంది ఆమె.

షాక్ నుండి తేరుకున్న మరుక్షణం ఆమె మొదటగా చేసిన పని...శిక్షణా కాలంలో చెప్పిన రహస్యకోడ్‌ను ప్రయోగించి కాక్‌పిట్‌లోని సిబ్బందికి ప్రమాద సూచన చేయటం!

ప్రమాద సూచన అందిన వెంటనే, పైలట్, కో పైలట్ ఎలర్టు అయ్యారు.

విమానం లోపల ఏం జరిగిందో వారికి తెలియదు. కాని యేదో ప్రమాదం వాటిల్లబోతున్నదని వారికి సూచన అందింది. రాబోతున్న ప్రమాదం యేమిటో, తామేం చేయాలో కూడా వారికి అర్థంకాలేదు.

కాక్‌పిట్‌లోనుండి విమానంలోనికి చూసారు వారు. అప్పుడే ఎంట్రన్స్ గేటును దాటి లోపలకు అడుగు పెడుతున్నారు ఆ ముగ్గురు అధికారులు.

ప్రమాద సూచనను అందుకొని వచ్చిన సెక్యూరిటీ స్క్వాడ్ అనుకున్నారు వారు ఆ ముగ్గురినీ చూస్తూ.

ప్రమాదం యేమిటో వారిని కనుక్కుందామని అడుగు ముందుకు వేయబోయాడు పైలట్.

అదే క్షణంలో—

ఆ ముగ్గురూ తమ చొక్కాల క్రింద దాచిన రివాల్వర్స్‌ను పైకితీసారు.

అవి లేటెస్టు మోడల్ బెరెట్టా రివాల్వర్స్.

మామూలు రివాల్వర్ ల బరువులో సగం వుంటాయి అవి. పదహారు బుల్లెట్లు వుండే ఆ బెరెట్టాతో మామూలు రివాల్వర్ కంటే రెట్టింపు వేగంతో షూట్ చేయవచ్చు.

అత్యాధునిక రివాల్వర్లతో రాక్షసుల్లా నిలబడ్డ వారిని చూసిన వెంటనే పైలట్ కు వారెవరో అర్థం అయిపోయింది.

"హై...జా...క...ర్స్" సన్నగా గొణుక్కున్నాడతడు.

'ఆ హైజాకర్స్ కాక్ పిట్ లోనికి ప్రవేశించకముందే యేదో ఒకటి చేయాలి' అతడు ఆలోచిస్తున్నాడు.

అప్పటికే అతడి కో పైలట్ కాక్ పిట్ లోని రహస్య మార్గం తెరిచి వుంచాడు. నేలకు 36 అడుగుల ఎత్తులో వుంది ఆ రహస్య ద్వారం.

ఏం చేయాలి?

ప్రాణాలతో వారికి పట్టుబడటంకన్న పారిపోవటం మేలేమో! అనుకున్నారు వారు.

వారు వెంటనే తెగించి క్రిందకు దూకేశారు. ప్లేన్-ఫేస్ షీట్ నుండి జారి క్రిందికి పడ్డారు వారు. పైలట్ కు మోకాళ్ళు, మోచేతులూ కొట్టుకుపోయాయి. కో పైలట్ కు మోకాలు బెణికింది. దానితో బోర్లాపడ్డాడు. నుదురు చిట్లింది. ముక్కు, పెదవులూ రక్తసిక్తాలయ్యాయి.

"హైజాకర్స్! హైజాకర్స్!" అంటూ దెస్పరేట్ గా అరుస్తూ ఎయిర్ పోర్టు ఆఫీసువైపు పరుగెత్తారు వారు.

'హైజాకర్స్' అన్నమాట వినిపించగానే ఎయిర్ పోర్టులో సంచలనం మొదలయింది.

ప్రాణ భీతితో ప్యాసెంజర్లు చెట్టుకొకరు, పుట్ట

కంగారుగా పారిపోయారు. కేవలం కొద్దినిమిషాలలో పాలం ఎయిర్ పోర్టు నిర్మానుష్యమయిపోయింది.

విమానాశ్రయ సిబ్బంది, సెక్యూరిటీ ఫోర్స్ తప్ప ఒక్క పురుగుకూడా మిగలలేదు అక్కడ.

ఈ కలకలానికి...లోపలనున్న హైజాకర్స్ ఎలర్టు అయ్యారు.

విమానం తలుపులూ, కిటికీలూ అన్నీ మూసేశారు వారు.

అదొక విచిత్రమైన పరిస్థితి.

విమానం హైజాక్ చేయబడింది. కాని విమానాన్ని నడిపేందుకు పైలట్ గాని, అతడి సిబ్బందిగాని లేరు. తప్పించుకు పారిపోయారు.

ఆ విమానం అక్కడనుండి కదలదు. హైజాకర్స్ యెక్కడికీ పారిపోలేరు.

కాని....వారి చేతులలో బెరెట్టా రివాల్వర్స్ వున్నాయి. వారి దయాదాక్షిణ్యాలపై 394 మంది ప్రయాణీకుల ప్రాణాలు ఆధారపడి వున్నాయి.

వారు ఎక్కడికీ పోలేరు.

వారి దగ్గరకూ ఎవరూ పోలేరు.

ఏం జరగబోతూంది?

అటు అధికారులలోనూ, ఇటు హైజాకర్స్‌లోనూ... క్షణ, క్షణానికీ సందేహం మేరువులా పెరుగుతూంది.

టెన్షన్...!

3

చేతిలోని రివాల్వర్స్‌తో కాలరుద్రుల్లా నిలుచున్న ఆ ముగ్గురి వంకా భయం, భయంగా చూస్తున్నారు విమానంలోని ప్రయాణీకులు.

ఆ ముగ్గురిలో ఒకడు పెదవులను విప్పాడు. ఊపిరి బిగబట్టి మరీ అతడి మాటలను వినసాగారు ఆ ప్రయాణీకులు.

"చూడండి .... లేనిపోని రిస్కులు తీసుకొని మీ ప్రాణాలమీదకు తెచ్చుకోకండి. మా అనుమతిలేకుండా కదిలితే నిర్దాక్షిణ్యంగా కాల్చిపారేస్తాం.

మేం ముగ్గురమే కదా మీరు 494 మంది కదా అని మీరేమైనా అతిగా ఆలోచిస్తున్నారేమో!

మా దగ్గరున్న బెరెట్టా రివాల్వర్స్‌లో ఒక్కొక్క దానిలో పదహారు బుల్లెట్స్ వున్నాయి. అంటే మొత్తం నలభై ఎనిమిది...బుల్లెట్లు.

నలభై ఎనిమిదిమందిని చంపాక మేం పట్టుబడటం అంటూ సంభవిస్తుంది.

ప్రాణాలకు తెగించే మేం ఈ హైజాకింగ్‌కు సిద్ధపడ్డాం. అఖండ ఖలిస్తాన్ కోసం ఆత్మార్పణ చేయడానికి ధీరులైన శిక్కులెవరూ వెనుకంజ వేయరన్న నిజం మీకు తెలుసనుకుంటాను.

సో...మాతో సహకరించండి.

ప్రభుత్వం మా డిమాండ్లను అంగీకరించిన మరుక్షణం మిమ్మల్ని క్షేమంగా విడుదలచేస్తాం. అంతవరకూ మీరంతా బుద్ధిగా వుంటారనే ఆశిస్తాను."

సూది క్రిందపడితే వినిపించేంతటి నిశ్శబ్దం అలుముకుంది ఆ విమానంలో.

రెండు క్షణాల తరువాత మళ్ళీ అతడే మాట్లాడటం ప్రారంభించాడు.

"మీకు తెలుసో, తెలియదో...ఈ విమానంలోని పైలట్, కో పైలట్ క్రిందకు దూకి పారిపోయారు.

నా. .విమానాశ్రయంలోని అధికారులతో మాట్లాడ టానికి వైర్‌లెస్ సెట్ ఆపరేషన్ తెలిసినవారు ఎవరైనా కావాలి. మీలో అలాంటి వారు ఎవరైనా వున్నారా? వుంటే... పైకి లేచినిలబడండి. ఎంత వేగంగా మనం విమానాశ్రయ అధికారులను కంటాక్ట్ చేయ గల్గితే... అంత వేగంగా మీరు విడుదల గావచ్చు.

"సో,.మీ కోసం మీ విడుదలకోసమైనా మీరు మాతో సహకరించాలి."

ప్రయాణీకులంతా ఒకరి, ముఖాలొకరు చూసుకు న్నారు. 'ఆ వైర్‌లెస్ ఆపరేషన్ తెలిసిన వారెవరైనా వుంటే లేచి, పుణ్యంకట్టుకోండిరా బాబూ!' అన్న అభ్యర్థన వారి కళ్ళల్లో కదలాడుతూంది.

ఆ ముగ్గురూ, ప్రయాణీకుల వంక అసహనంగా చూస్తున్నారు.

రెండు క్షణాల తరువాత...

ఒక ప్రయాణీకుడు మెల్లగా లేచి నిలబడ్డాడు.

'తమను ఆదుకోడానికి వచ్చిన ఆపద్బాంధవుడు ఎవరా' అని అతడి వంక ప్రయాణీకులంతా ఆత్రంగా చూశారు.

అంతే!

అతడిని చూసిన మరుక్షణం వారి ముఖాలు వల్లగా మాడిపోయాయి. భయాశ్చర్యాలతో వారు నోళ్ళు తెరిచారు.

అతడి వంక సాదరంగా చూశారు ఆ ముగ్గురు హైజాకర్లూ. వారి పెదవులపై చిరునవ్వు చిందులేసింది.

అతడు...

ఆ లేచిన ప్రయాణీకుడు...ఒక శిష్య..!

'అగ్నికి వాయువు తోడయినట్లు, వున్న మగ్గుడూ చాలక, వీరికి తోడు మరొకడా!' అనుకున్నారు ప్రయాణీకులు.

"ఐ యామ్ జోగిందర్ సింగ్."

భీకరంగా, డబ్బాలో గులకరాళ్లు వేసినట్లు ధ్వనించింది అతడి గొంతు.

అతడి కళ్ళు ఎర్రగా, చింతనిప్పుల్లా వున్నాయి. కందగడ్డలా వుంది ముఖం. చూడగానే దయా, దాక్షిణ్యాలు లేని కసాయివాడులా అవుపిస్తాడు అతడు.

పెద్ద, పెద్ద అంగలు వేసుకుంటూ ముందుకు నడిచాడు అతడు.

"వెల్‌కమ్ జోగిందర్ సింగ్! వెల్‌కమ్! మాతో మరో శిక్కు సోదరుడు చేతులు కలుపుతున్నందుకు మాకెంతో సంతోషంగా వుంది."

జోగిందర్‌ను కాక్‌పిట్ వైపు ఆహ్వానిస్తూ అన్నాడు ఒకడు. మిగిలిన ఇద్దరూ జాగ్రత్తగా ప్రయాణీకులను కవర్ చేస్తూ నిలుచున్నారు.

ఒక్కొక్క క్షణం భారంగా దొర్లుతోంది.

4

ఎయిర్ పోర్టు అంతా హడావుడిగా వుంది.

ఓ ప్రక్క అధికారులు ఆదుర్దాగా తిరుగుతున్నారు. మట్టిగంగు యూనిఫారాలు ధరించిన పదిమంది కమెండోలు అధికారుల అనుజ్ఞకోసం యెదురుచూస్తూ నిలుచున్నారు. వారి చేతులలో శక్తివంతమైన స్టెన్ గన్స్ వున్నాయి. వారి భుజాలపై టియర్ గ్యాస్ సిలిండర్లు బెల్టులతో బిగించబడి వున్నాయి.

మరోప్రక్క లౌడ్‌స్పీకర్‌ను పట్టుకొని 'హైజాకర్స్‌ను

లాంగిపొమ్మని' హెచ్చరికలు పంపుతున్నా డొక అధికారి.

యింకో ప్రక్క ఎయిర్‌ఫోర్ట్ చీఫ్ కంట్రోలర్ రూమ్‌లో సి.బి.ఐ. ఆఫీసర్లతో రహస్య సమావేశం జరుగుతుంది.

అధికారులంతా తీవ్రంగా ఆలోచిస్తున్నారు.

'ఏం చేయాలి? ఈ రాన్‌సమ్‌ను ఎలా టాకిల్ చేయాలి?'

విమానంనుండి తప్పించుకు వచ్చిన పైలట్ మాటలను బట్టి హైజాకర్స్ ముగ్గురేనని తెలుస్తూంది.

కాని, వారి చేతులలో బెరెట్టా రివాల్వర్స్ వున్నాయని కూడా తెలుస్తూంది.

కమెండోలను పంపి, విమానాన్ని ముట్టడించి, హైజాకర్స్‌ను బంధించడం పెద్ద సమస్య కాదు. కాని, కమెండోల ఎటాక్ గురించి హైజాకర్స్‌కు తెలిసిందంటే....

కమెండోలు విమానాన్ని ముట్టడించే లోగానే కొందరు అమాయకులైన ప్రయాణీకుల ప్రాణాలను పొట్టన పెట్టుకుంటారు వారు. విమానాన్ని ధ్వంసం చేయవచ్చు.

మరి ఎలా? ఎలా ఈ చిక్కుముడిని విప్పడం?' అదే వారు తీవ్రంగా ఆలోచిస్తున్నారు.

అదే సమయంలో....

కంట్రోల్ రూమ్‌లో....

వైర్‌లెస్ సెట్ ముందు ఆత్రంగా నిలబడి ఎదురు చూస్తున్నారు మరికొందరు ఎయిర్‌లైన్స్ అధికారులు.

'హైజాకర్లు ఏవో గొంతెమ్మ కోర్కెలు కోరతారని, ప్రయాణీకులను విడిచిపెట్టడానికి ఏవో కండిషన్లను విధి

స్తారని' ఆ అధికార్లకు తెలుసు.

అందుకే వారు ఆత్రంగా ఎదురు చూస్తున్నారు.

హైజాక్ చేయబడ్డ విమానంతో సంబంధాలను పున రుద్ధరించడానికి ఆపరేటర్ నిర్విరామంగా ప్రయత్నిస్తు న్నాడు. కానీ అటునుండి ఏ విధమైన రెస్పాన్సూ రావటంలేదు.

అలసటతో అతని నుదుట చెమట పట్టింది.

రెండు నిముషాలు ఆగి, మళ్ళీ ప్రయత్నిద్దామని, హెడ్ ఫోన్సును తీసి ప్రక్కను పెట్టబోయాడతడు.

అదే క్షణంలో....

అతని ఎదురుగా నున్న వైర్ లెస్ సెట్ ప్రాణంపోసు కున్నట్లు 'బీప్ ....బీప్' మంటూ అరవసాగింది.

ఆ శబ్దాలను విన్న మరుక్షణం అతడిలోని అలసట మాయమైపోయింది.

"కనెక్షన్ లభించింది" అన్నాడతడు ఉత్సాహంగా తన అధికారులవంక చూస్తూ.

అతడి వెనుక నిలుచున్న ముగ్గురు అధికారులూ ఆత్రంగా ముందుకు వంగారు.

ప్రక్కనే వున్న టేప్ రికార్డర్ ను ఆన్ చేశాడు ఆపరే టర్. అదే చేత్తో స్టీరియో బాక్సులకు కనక్షన్ యిచ్చాడు.

చీఫ్ కంట్రోలర్ రూంలో వున్న ఉన్నతాధికార్లు స్టీరియోగుండా వినవస్తున్న మాటలను ఆలకించసాగారు.

వైర్ లెస్ సెట్ ద్వారా ప్రసారమవుతున్న హైజా కర్స్ మాటలను రికార్డ్ చేస్తూ టేప్ రికార్డర్ లోని స్పూల్ మెల్లగా తిరుగుతూంది.

హైజాకర్స్ చెబుతున్న ఒక్కొక్క కండిషన్నూ

వింటున్నకొద్దీ....అధికారుల నుదుట చెమటలు పట్ట సాగాయి.

హైజాకర్లు ముచ్చటగా మూడే కోర్కెలను కోరారు. అవి:

ఒకటి: పది మిలియన్ల అమెరికన్ డాలర్లను ఒక బాక్సులో పెట్టి, వారికి అందించాలి. ఆ బాక్సును మోసు కొని విమానం దగ్గరకు వచ్చే వ్యక్తి, ఒంటిమీద కేవలం డ్రాయర్ మాత్రమే ధరించాలి.

ఆ డబ్బు అందిన తరువాత, మొదటి విడతగా నూరు మంది ప్రయాణీకులు విడుదల చేయబడతారు.

రెండు: ఖలిస్తాన్ ఉద్యమంలో తీవ్రవాదులుగా అరెస్టు చేయబడి, తీహార్ జైలులో శిక్షననుభవిస్తున్న టెర్రరిస్టులను విడుదల చేయాలి. వారు విడుదలయ్యారని ధృవపరచుకున్నాక .... రెండవ విడతగా మరో నూరు మంది ప్రయాణీకులు విడుదల చేయబడతారు.

మూడు: పైలట్‌నూ, అతడి సిబ్బందినీ పంపి, విమానం అక్కడనుండి కదిలే ఏర్పాట్లు చేయాలి. విమా నాన్ని క్షేమంగా అమెరికాలోని 'ఈక్వెడర్' కు చేర్చాలి.

ఈక్వెడర్ చేరిన తరువాత మిగిలిన ప్రయాణీకులు విడు దల చేయబడతారు.

వీటిలో ఏ ఒక్కదానికి వ్యతిరేకంగా జరిగినా ఆ విమా నాన్ని బాంబులతో పేల్చేస్తారు.

హైజాకర్ల కోర్కెలను విన్నమీదట అధికార్లకు కాళ్ళూ, చేతులూ ఆడటం మానేశాయి.

'తాము ప్రభుత్వంతో సంప్రదించడానికి కనీసం ఎని మిది గంటల వ్యవధి అయినా కావాలి' అన్నారు అధికా

రులు....ఆ హైజాకర్లతో.

కాని, హైజాకర్లు దానికి అంగీకరించలేదు. కేవలం మూడు గంటల వ్యవధి యిచ్చారు వారు. ఆ మూడు గంటలలో ప్రభుత్వం తమ కోర్కెలను సమ్మతిస్తున్నట్లు మెసేజ్ రాకుంటే....

ఆ క్షణం నుండీ మారణహోమం ప్రారంభమవుతుందని' అన్నారు వారు.

'ప్రతి పది నిముషాలకూ ఒక్కొక్క ప్యాసెంజరు శవ రూపంలో రన్ వే మీదకు విసిరివేయబడతారు.'

అదీ వారి చివరి హెచ్చరిక!

అప్పుడు సమయం సరిగ్గా అయిదుగంటలు.

5

విమానంలోని ప్రయాణీకుల పరిస్థితి మరింత అధ్వాన్నంగా వుంది.

టెన్షన్ వలన పట్టిన చెమట, ధారగా కారసాగింది. ఎయిర్ కండిషనర్లు పనిచేస్తున్నా ఒకటే వుక్కగా వుంది వారికి.

కాస్త కదలాలంటే భయం. బిగుసుకొని కూర్చోవడం వలన వారి వెన్నుముకలు లాగేస్తున్నాయి. ఈ మధ్యలో ఒకరిద్దరు పిల్లలు ఏడుపులు మొదలుపెట్టారు.

మామూలుగా అయితే .... ఈ పాటికి, ఎయిర్ హోస్టస్ టీ, బిస్కట్లను సర్వ్ చేసేది. ఎంచక్కా చాక్లెట్లో, పేపర్లో యిచ్చేది.

ప్రయాణీకుల్లో మూడువంతుల మందికి పైగా 'ఒక కప్పు టీ యైనా' త్రాగాలని వుంది. కాని ధైర్యంచేసి అడిగేదెవరు?

లేచి, నిలబడి, అడిగేలోగానే కాల్చి పారేస్తారేమో

నన్న భయం.

అందరి గుండెలూ భయంతో వణికిపోతున్నాయి.

ప్రయాణీకుల దుస్థితిని గమనించిన మొదటి వ్యక్తి ఎయిర్ హోస్టెస్ రంజిత.

"భాయియోం!" అంది ఆమె మెల్లగా ఆ హైజాకర్లను సంబోధిస్తూ.

ఆ మిరంక చిరాకుగా చూశారు వారు.

"ఐయామ్ రంజితా. నేనూ పంజాబీ అమ్మాయినే" అంది ఆమె చిన్నగా నవ్వడానికి ప్రయత్నిస్తూ.

"అయితే ఏం?" అన్నట్లు చూశారు వారు.

అయితే వారి చూపుల్లో ఇంతకు క్రితం వున్న చిరాకు లేదు. కాస్త ప్రసన్నంగా వున్నాయి వారి చూపులు.

"మీరు అనుమతిస్తే మీకు తలా ఒక కప్పు టీ కలుపుకు రానా, అలాగే పాపం ఈ ప్రయాణీకులకు కూడా"

ఎంతో నమ్రతతో అంది ఆమె.

వారు ఒక్క క్షణం సంశయంగా చూశారు.

'నిజమే! వారికీ ఒక కప్పు టీ త్రాగాలనే ఉంది.' వారు ఒకరినొకరు చూసుకుని తలలు పంకించుకున్నారు.

"సరే! ముందుగా నాలుగుకప్పుల టీ తీసుకొని రా! బట్ బేబీ! ఒక్క విషయం గుర్తుంచుకో....

ఏమయినా చీప్ ట్రిక్స్ మామీద ప్రయోగించాలని చూస్తే మాత్రం....ప్రాణాలు పోతాయి జాగ్రత్త!" అన్నాడు ఆ ముగ్గురిలో ఒకడు.

రంజిత మౌనంగా ముందుకు నడిచింది.

అయిదు నిముషాల తరువాత....

పొగలు క్రక్కుతున్న టీని నాలుగు కప్పులలో పోసి,

ట్రేలో పెట్టుకొని వచ్చింది రంజిత.

ఆత్రంగా కప్పులను అందుకోబోతున్న తన ఇద్దరు సహచరులనూ, ఆగమని వారించాడు వారిని లీడ్ చేస్తున్న మూడవ యువకుడు.

ఒక సాసర్‌ను తీసుకొని, అందులో నాలుగు కప్పుల లోని టీని కొంచెం, కొంచెంగా పోసాడు. అప్పుడు ఆ సాసర్‌ను రంజితకు అందించాడు.

"కమాన్ బేబీ! సిప్ ఇట్!

ఇందులో విషమో. మత్తుమందో కలిపి వున్నట్లయితే ఆ రిస్క్ ఏదో నీవు తీసుకుందువుగాని." అన్నాడతడు క్రూరంగా నవ్వుతూ.

రంజిత ఆ సాసర్‌ను అందుకుని, నిర్భయంగా అందు లోని టీని త్రాగింది. ఆమె ముఖంలో కలవరంగాని, భయంగాని మచ్చుకైనా కన్పించలేదు వారికి.

కడిగిన ముత్యంలా స్వచ్ఛంగా, నిర్మలంగా వుంది ఆమె ముఖం.

అప్పుడు.... వారు నిస్సంకోచంగా ఆ కప్పులలోని టీని త్రాగారు.

ఆ ముగ్గురు హైజాకర్లతో పాటు వాళ్ళ కప్పును తీసుకు న్నది జోగిందర్ సింగ్.

రివాల్వర్ పట్టుకున్న ఆ ముగ్గురు హైజాకర్లకన్నా, ఆ విమానంలోని ప్రయాణీకులను ఎక్కువగా భయకంపితు లను చేస్తున్నది జోగిందర్ సింగ్,

అత్యంత క్రూరంగా వున్నాయి అతడి చూపులు. రక్తం త్రాగే రాబందులా వున్నాడతడు.

హైజాకర్లతో ఏదో నవ్వుతూ మాట్లాడుతున్నా

దతిడు. అది నవ్వులా లేదు. పిశాచం పలికరించినట్లు వుంది. అతడివంక చూడలేక కొందరు ప్రయాణీకులు భయంతో కళ్ళు మూసుకున్నారు.

హైజాకర్ల అనుమతితో....ప్రయాణీకులకు టీని సర్వ్ చేయటం ప్రారంభించిందది రంజిత.

అలసట కనిపించని ముఖంతో, చెరగని చిరునగవుతో ఆమె అలా నిర్విరామంగా తిరుగుతూనే వుంది.

అయితే, కప్పులలో టీని పోసుకొని వచ్చే కాస్త వ్యవధిలోనూ ఆమె... టీరూమ్ వున్న కిటికీలో నుండి ఎయిర్ పోర్ట్ అధికారులకు సంజ్ఞల ద్వారా ఒక మెసేజ్ ను పాస్ చేసిందన్న విషయం....హైజాకర్లు గమనించ లేదు.

ఆ మెసేజ్ సాయంతో....అధికారులు ఒక అద్భుత మైన వ్యూహం పన్నగలిగారు.

అప్పుడు సమయం ఆరుగంటలు.

6

కొన్నిగంటల క్రితం....సి.బి.ఐ. ఆఫీసులో....

"ఆఫీసర్స్!

హైజాకర్స్ యొక్క డిమాండ్లను బట్టి, వారు ఎంచు కున్న ఎయిర్ రూట్ ను బట్టి వారు ఖలిస్తాన్ వేర్పాటు వాదులన్న విషయం స్పష్టమౌతూంది.

వారు ఎయిర్ లైన్స్ కు సంబంధించిన దానిలా కనిపించే సుజాకి వ్యాన్ లో వచ్చారు. విమానాశ్రయ భద్రతా సిబ్బంది ధరించే దుస్తులనూ, బాడ్జీలను ధరించారు.

ఇవన్నీ వారికెలా వచ్చాయి?

ఎయిర్ లైన్స్ కు సంబంధించిన వారెవరో ఆ టెర్రరిస్టు లకు సహాయం చేసివుండాలి.

అంత దెవరో ఆఫీసరు రాంకు వారై వుండాలి. ఎందుకంటే, సామాన్యులకు ఇవన్నీ చేయటం సాధ్యంకాదు.

సో! పాలం విమానాశ్రయానికి సంబంధించిన ఎయిర్ లైన్స్ ఆఫీసర్ల లిస్టును తీసుకోండి. వారిలో శిక్కులను పైకి తీయండి.

వారు గత కొద్దికాలంగా, తరచుగా గాని, అప్పుడప్పుడుగాని పంజాబులోని తమ స్వగ్రామాలకు వెళ్ళారా అన్నది పరిశోధించి ఒక రిపోర్టు తయారుచేయండి.

ఈ గాలింపు పూర్తయితే....

తెర వెనుకనుండి ఈ హైజాకర్స్‌కు సాయంచేసిన ఆ కల్ప్రిట్ ఎవడో చిక్కుతాడు మనకు.

దూ క్విక్!"

యిక చెప్పాల్సిందేమీ లేనట్లు రిలాక్సింగ్ గా వెనక్కు వ్రాలాడు సి.బి.ఐ. చీఫ్ కరుణాకర్.

అతడి వద్ద శెలవు తీసుకుని ఆగది బయటకు నడిచారు ఆ సి.బి.ఐ. ఆఫీసర్లు.

పాలం విమానాశ్రయంలో విమానం హైజాక్ చేయబడిందని తెలిసిన వెంటనే విమానాశ్రయ అధికారులు ఆ విషయాన్ని హోం డిపార్ట్ మెంట్ కు తెలియజేశారు.

హోం డిపార్ట్ మెంట్ ఆజ్ఞపై సి.బి.ఐ. రంగంలోనికి దిగింది.

మొదట....సి.బి.ఐ. ను రెండు వింగ్ లుగా విభజించాడు సి.బి.ఐ. చీఫ్ కరుణాకర్.

ఒక వింగ్ రెస్క్యూ ఆపరేషన్ కోసం ఎయిర్ పోర్ట్ కు పంపబడింది.

ఇంకొక వింగ్ .... ఈ హైజాకింగ్ వెనుకనున్న

అదృశ్య హస్తాలను అన్వేషించడానికి బయలుదేరింది.

ఇక్కడ ఇలా అన్వేషణ జరుగుతూండగా....

అక్కడ....

పాలం విమానాశ్రయంలోని ఒక చాంబర్ లో.

ఎదురుగా ఎటెన్షన్ లో నిలబడ్డ కమెండోల వంక చూసి మెల్లగా చెప్పడం ప్రారంభించాడొక సి.బి.ఐ. సీనియర్ ఆఫీసర్.

"నేను చెప్పబోయేది జాగ్రత్తగా వినండి.

హైజాక్ చేయబడ్డ విమానంలోనున్న ఎయిర్ హోస్టెస్ రంజిత దగ్గరనుండి ఇప్పుడే మనకొక కోడ్ మెసేజ్ వచ్చింది.

ఆమె సూచన ప్రకారం ఒక పథకం వేయబడింది. లుక్ ఎట్ దిస్. ఒక్కసారి ఈ బ్లాక్ బోర్డువంక చూడండి."

కమెండోలు గోడకు వ్రేలాడదీయబడ్డ బ్లాక్ బోర్డు షీట్ వైపు చూసారు. దానిపై ఒక విమానం బొమ్మ గీయబడి వుంది.

"రన్ వే మీదనున్న ఈ విమానాన్ని ఒక్కసారి పరిశీలనగా చూడండి. తోక భాగం ఎయిర్ పోర్టువైపు, తల భాగం అవుట్ వే వైపు వున్నాయి.

అవుట్ వేలో....విమానం కొంతసేపు రన్ వే మీద పరుగెత్తి ఆ తరువాత గాలిలోకి యెగరటం ప్రారంభిస్తుందన్నమాట.

అక్కడ రన్ వేకు ఇరువైపులా పచ్చగా మోకాళ్ళ ఎత్తున ఎదిగిన గడ్డిగుబ్బులున్నాయి. వాటి మధ్య మనుషులు ప్రాకుతుంటూ వచ్చినా యెవరూ గమనించలేరు.

మీరంతా కారుల్లో యెక్కి, ఎయిర్ పోర్టు బయటకు

వెళ్ళిపోతారు. చుట్టూ తిరిగి అవుట్ వే గుండా, గడ్డి దుబ్బుల మధ్యనుండి ప్రాకుతుంటూ విమానాన్ని సమీపిస్తారు.

ఇప్పుడు సమయం ఆరుగంటలు దాటింది. అప్పుడే మసక చీకట్లు క్రమ్ముకుంటున్నాయి. రన్ వే ప్రక్క లాండింగ్ ప్లేస్ లోనూ లైట్లు వెలిగించబడవు.

అవుట్ ఫీల్డు అంతా చీకటిగా వుంటుంది. కేవలం ఎయిర్ పోర్టు బిల్డింగ్ లో మాత్రమే లైట్లు వెలుగుతూ వుంటాయి.

అంటే.... చీకటి మీకు సహాకరిస్తుందన్న మాట. విమానాన్ని సమీపించేటంత వరకూ మీరు నేలమీద ప్రాకుతుంటూనే పోవాలి. మీ బూట్లను విడిచిపెట్టండి. లేకుంటే శబ్దం చేస్తాయి.

ఇక, విమానం క్రింది భాగానికి చేరుకున్నాక మీరు రెండు జట్లుగా విడిపోతారు.

ఒక జట్టు కాక్ పిట్ క్రింద భాగం దగ్గరకు చేరుకుంటారు. అక్కడ మన పైలట్స్ పారిపోయి వచ్చిన రహస్య ద్వారం వుంటుంది. అయితే భూమికి 36 అడుగుల ఎత్తులో వుంటుంది.

ఏ ఆధారమూ లేకుండా, నున్నగా వుండే ప్లేన్ బాడీ షీట్ మీద ప్రాకుతుంటూ మీరెలా పైకి వెళ్తారు?"

చెప్పడం ఆపి ఒక్క క్షణం ఊపిరి పీల్చుకున్నాడు ఆ ఆఫీసర్. ఆ కమెండోల వంక సాలోచనగా చూశాడు. తరువాత ప్రక్కనున్న పెద్ద కార్డ్ బోర్డు బాక్స్ నుండి కొన్ని వస్తువులను పైకితీశాడు.

అవి అన్నీ ఒకేలా వున్నాయి. పది అంగుళాల పొడవున్న అల్యూమినియం గొట్టాలవి. పది మిల్లీమీటర్ల

వ్యాసార్థం వుంటుంది వాటి భూతలం. వాటికి రెండు వైపులా రెండు రబ్బరు కప్పెలు అతికింపబడి వున్నాయి. వాటిని కమెండోలకు చూపించాడతను.

"ఇవి రబ్బరు వాక్యూమ్ స్టిక్స్. వీటిని ప్లేన్ బాడీకి ఆన్చి వుంచండి. అల్యూమినా స్టిక్‌కు వున్న ఈ చిన్ని బుడిపెను నొక్కండి. అప్పుడు ప్లేన్ బాడీకి, రబ్బరు కప్పెకూ మధ్యనున్న గాలి పైకి వచ్చేస్తుంది. దానితో రబ్బరు కప్పెలు ప్లేన్ బాడీకి గట్టిగా అతుక్కుపోతాయి రెండు కప్పెల మధ్యనున్న అల్యూమినా స్టిక్ నిచ్చెన మెట్టులా ఉపయోగపడుతుంది.

ప్లేన్ బాడీకి రెండు వరుసలలో, అరవై డిగ్రీల వాలుతో ఈ స్టిక్స్‌ను అతికించండి. వాటి సాయంతో మీరు సులువుగా, ఐ మీన్ మెట్లమీద నడిచినంత సులువుగా ప్లేన్ మీదకు చేరుకోవచ్చు.

అయితే మీకో సందేహం రావచ్చు. ఈ వాక్యూమ్ రబ్బరు కప్పెలు మీ బరువును భరించగలవా? అని.

వాయు శూన్యతలం గురించి సైన్స్‌లో ఒక అద్భుత రహస్యం వ్రాయబడింది.

అర్థగోళాకారంలోనున్న రెండు గిన్నెలను ఒకదానితో వొకటి కలిపి, ఆ రెండింటి మధ్యనున్న గాలిని తీసివేయ గలిగినట్టయితే....

అతుక్కుపోయిన ఆ గిన్నెలను ఇరువైపులా బలిష్టమైన ఆరు గుర్రాలకు తాళ్ళతో కట్టి. వ్యతిరేక దిశలో లాగించినా, ఆ గిన్నెలు విడిపోవు.

వాయుశూన్య ప్రదేశానికి వున్న పట్టు అలాంటిది. ఆ ఫార్ములాలో చేయబడ్డ రబ్బరు కప్పెలివి. ఒకసారి అతుక్కున్నాక విడిపోతాయేమోనన్న సమస్యే లేదు.

ఒక్కొక్కరు పదేసి స్టిక్స్‌ను తీసుకోండి."

కమెండోలు వరుసలో వచ్చి ఆ స్టిక్స్‌ను తీసుకొన్నారు. ఆ ఆఫీసర్ వారి వంక చూసి మళ్ళీ చెప్పడం ప్రారంభించాడు.

"అయితే మన పైలట్లు దూకి వచ్చిన కాక్‌పిట్ క్రిందనున్న రహస్య మార్గాన్ని ఈ పాటికి హైజాకర్లు క్లోజ్ చేసి ఉండవచ్చు.

అప్పుడు మీరు అక్కడే మాటువేసి వుండాలి. బై ఛాన్స్, ఒకవేళ ఆ ద్వారం మూయబడకుండా వుంటే, దానిగుండా మీరు విమానంలోనికి ప్రవేశించాలి.

ఇదంతా మొదటి బ్యాచ్ చేయాల్సిన పని.

ఇక రెండవ బ్యాచ్.

విమానం ఎడమ రెక్క క్రిందకు వెళ్ళండి. ఆ రెక్క పై భూమికి 14 అడుగుల ఎత్తున ఒక తలుపు వుంటుంది. ఆ తలుపువరకూ కవ్వెలతో నిచ్చెనలు అమర్చుకొని పైకి ప్రాకుకొని పోండి. సరిగ్గా తలుపు దగ్గరే పొంచివుండండి. వెయిట్ దేర్ పేషెంట్లీ.

వీలు చూసుకొని ఎయిర్ హోస్టెస్ రంజిత ఆ తలుపును తెరుస్తుంది.

మరుక్షణం.... మీరు మెరపుతీగల్లా లోపలకు చొరబడాలి. ఆ హైజాకర్స్ తేరుకొనే లోగానే వారిపై ఎటాక్ చేయండి. వీలుంటే వారిని ప్రాణాలతో బంధించండి.

లేకుంటే... షూట్ దెమ్ అవుట్!"

ఒక్క క్షణంసేపు ఆ గదిలో నిశ్శబ్దం రాజ్యమేలింది. గాలికూడా స్తంభించినట్లుయింది.

మనిషి మృగంగా మారినప్పుడు, మానవత్వం మరచి

పాటి మనిషి ప్రాణాలను తీయడానికి సిద్ధపడినప్పుడు...
మృగంలాంటి ఆ మనిషిని వేటాడి చంపాలి.

చంపి తీరాలి!

కాలం మారినా, మనుషులు మారినా, నీతి సూత్రాలు మారినా, ధర్మ శాస్త్రాలు మారినా....

ఈ సిద్ధాంతం మాత్రం మారదు.

7

తన అపార్టుమెంట్‌లో బెడ్ మీద ముసుగు తీసుకొని పడుకొని ఉన్నాడు కర్తార్ సింగ్.

ఏదో తెలియని భయంతో అతని గుండెలు వణికిపోతున్నాయి. ఫుల్ స్పీడ్‌తో ఫాన్ తిరుగుతున్నా అతడి శరీరం, చెమటలు పడుతూంది.

గోడ గడియారం వంక చూశాడతను.

ఆరూనలభై అయిదు.

'ఈపాటికి ప్లేన్ హైజాక్ చేయబడి వుంటుందా? అన్నీ సవ్యంగానే జరిగి, విమానం టెర్రరిస్టుల చేతిలోనికి వస్తే, ఈపాటికి ప్లేన్ పాలం విమానాశ్రయాన్ని వదలి పెట్టి ఉండాలి.

ఏం జరిగింది? ప్లేన్ వెళ్ళిపోయిందా?'

అతడి మెదడులో అనంతమైన ప్రశ్నలు.

'ఏం జరిగిందో తెలుసుకుందామంటే....' ఎవరయినా అనుమానిస్తారేమోనన్న భయం.

పైకి రావాలంటే భయం!

ఎవరినైనా పలకరించాలంటే భయం!

ఆ టెన్షన్‌ను భరించలేకే అతడు శెలవుపెట్టి, గదిలో పడుకున్నాడు.

ఆ రోజు...

మతం నుండి వెలి వేస్తారన్న భయంతో, తమ మతాధి కారి మాటలకు ఎదురుచెప్పలేక, హైజాకర్స్‌కు సహక రించడానికి అంగీకరించాడు.

వారికి సహకరించాడు.

కాని, నిజం బయటపడితే ...తాను కల్ప్రిట్ నన్న విషయం తెలిసిపోతే యేమౌతుందన్న భయంపట్టుకుంది ఇప్పుడు.

ఉద్యోగం పోతుంది.

పదిమందిలో పరువుపోతుంది.

నలుగురూ ఛీ కొడతారు. దేశద్రోహి అని అసహ్యించు కుంటారు.

తను జైలు పాలవుతాడు.

ఎందుకు? ఎందుకు చేసాడిదంతా?

అతని మనసులో సంఘర్షణ మొదలయింది.

హాయిగా, దర్జాగా, పదిమంది మన్ననలు పొందే ఆఫీసరు స్థాయినుండి ఒక ఖైదీ స్థాయికి ఒక్కసారిగా దిగజారిపోవడమంటే...అతడికి ఆ నిజం జీర్ణంకావటం లేదు.

ఎత్తయిన జైలు గోడల మధ్య, చారల జైలు లాగు, బనీను ధరించి, జొన్న సంకటిని తినే ఖైదీ స్థానంలో తనను తాను ఊహించుకోలేక పోతున్నాడతడు.

'ఎందుకు? ఎవరి కోసం చేసాడిదంతా?!' తనను తానే ప్రశ్నించుకున్నాడతడు డెస్పరేట్‌గా.

"నీ జాతికోసం....నీ మతంకోసం....నీవీ పనిచేయక తప్పదు కర్‌తార్ సింగ్!"

సంత్ దలీప్ సింగ్ మాటలు గుర్తుకు వచ్చాయి

అతడికి. 'అవును మతంకోసం తానీ పని చేశాడు'.

ఎప్పుడో యూనివర్శిటీ గోడలమధ్య వ్రాయబడ్డ మాటలు అతడి కళ్ళముందు కదలాడాయి.

"మతం ఒక మత్తు మందు,
కులం ఒక పెంట కుప్ప!"

నిజమే.... హెరాయిన్ కన్న, నల్లమందుకన్న, ఎల్. ఎస్. డి కన్నా, బ్రాక్స్‌కన్నా ప్రమాదకరమైన మత్తు మందు.... మతం!

'ఆ మతం మత్తులో....ఆ మత్తునుండి వచ్చిన ఉన్మాదంలో....తనేం చేస్తున్నాడో తనకే తెలియని స్థితిలో తన జీవితాన్ని తనే సర్వ నాశనం చేసుకున్నాడు.'

అతడిలో క్షీరసాగర మథనం మొదలయ్యింది. ఆలోచనల సుడిలో అతడు కొట్టుకుపోతున్నాడు.

అదే సమయంలో....

ఆ అపార్ట్‌మెంట్ ముందు ఆగిందొక జీపు. ఒక యువకుడు జీపు దిగి, చకచకా మెట్లెక్కి అతడి అపార్ట్‌మెంట్‌ను సమీపించాడు.

ఎంతో పరిచయమున్నవాడిలా...సూటిగా ఆ అపార్ట్‌మెంట్ ముందుకు వచ్చి ఆగాడు.

కాలింగ్ బజర్‌ను నొక్కాడు.

కాలింగ్ బజర్ శబ్దానికి ఉలిక్కిపడ్డాడు కర్తార్ సింగ్. ఒక్క ఉదుటున మంచంమీదనుండి లేచాడు.

"ఎవరూ...?"

ఎంత నిగ్రహించుకున్నా అతడి గొంతు సన్నగా వణికింది. తడబడుతున్న అడుగులతో అతడు మెల్లగా తలుపు దగ్గరకు నడిచాడు.

'తన విషయం అప్పుడే పోలీసులకు తెలిసిపోయిందా?

తనను అరెస్టు చేయడానికి పోలీసులు వచ్చారా?'

భయంతో అతడి గొంతులో తడి ఆరిపోతూంది. వణుకుతున్న చేతులతో మెల్లగా తలుపులను తెరిచాడతడు.

ఎదురుగా ఉన్నది...ఎవరో అపరిచిత యువకుడు.

"అమ్మయ్య! పోలీసులు కాదు!" భారంగా నిశ్వసించాడు కర్తార్ సింగ్.

ఒక్క క్షణం తరువాత..

"ఎవరు మీరు?" ఆ యువకుని వంక చూస్తూ అడిగాడు కర్తార్ సింగ్.

ఆ యువకుడు సమాధానం చెప్పలేదు. మౌనంగా గదిలోనికి అడుగు పెట్టాడు. తలుపులను దగ్గరగా వేశాడు. కర్తార్ ఆ యువకుని వంక ఆశ్చర్యంగా చూశాడు. ఇదంతా ఒక్క అరనిమిషంలోనే జరిగిపోయింది.

"సంత్ దలీల్ సింగ్ పంపారు నన్ను" అన్నాడా యువకుడు నెమ్మదిగా.

దలీల్ సింగ్ పేరు విన్న వెంటనే కర్తార్ సింగ్ ముఖం నల్లగా మాడిపోయింది.

"ఎందుకు?" అన్నాడు హీనస్వరంతో.

"హైజాక్ కేసులో సి.బి.ఐ. రంగంలోనికి దిగింది కర్తార్ సింగ్!

ఈ హైజాక్‌కు సహాయపడిన ఎయిర్ లైన్స్ ఆఫీసర్ .... అంటే నీకోసం అన్వేషణ మొదలయింది. ఇక నీవు తప్పించుకోలేవు. జస్టు యూ కాన్ట్ ఎస్కేప్!

పోలీసులకు పట్టుబడతావు.

నీవు పట్టుబడితే.

నీద్వారా....కొన్ని తెలియకూడని స్థలాలూ, కొందరి

పేర్లూ సి.బి.ఐ.కు తెలుస్తాయి."

"నో.... నేనెందుకు చెబుతాను" డెస్పరేట్‌గా అన్నాడు కర్తార్ సింగ్.

"నీవు చెప్పవు కర్తార్ సింగ్!

వారు నీతో చెప్పిస్తారు చిత్రహింసలు పెట్టి. ఈ ఆధునిక కాలంలో చేజిక్కిన శతృవు నోటినుండి రహస్యాలను పైకి కక్కించడానికి ఎన్ని ఆధునిక పరికరాలు వచ్చాయో నీకు తెలియదు కర్తార్ సింగ్.

ఎంత మొండివాడయినా, ఎంత ఆత్మ నిగ్రహం కలవాడయినా ఆ యంత్రాలముందు తలవంచక తప్పదు.

మా శిక్కు సోదరుడు అన్ని చిత్రహింసల పాలవటం మాకిష్టంలేదు. అందుకే...."

ఆ యువకుడు చెప్పటం ఆపాడు. అతడి కుడిచెయ్యి మెల్లగా పాములా పాంటుజేబులోకి ప్రాకుతుంది.

"అందుకే...." అనుమానంగా అడిగాడు కర్తార్ సింగ్. ఏదో అనిశ్చిత భావం అతడిని కదలించి వేస్తూంది.

"మీరు చిత్రహింసల పాలవకముందే....

మీరు పోలీసుల ముందు పెదవి విప్పకముందే....

ఇప్పుడే....

మిమ్మల్ని చంపేస్తాను."

—నవ్వుతూ అన్నాడా యువకుడు.

"నో...." అంటూ గట్టిగా అర్చాడు కర్తార్ సింగ్.

కాని, అప్పటికే ఆ యువకుని చేయి పాంట్ జేబులో నుండి పైకి వచ్చింది. అతడి పిడికిలిలోని చిన్న రివాల్వర్ ఆరుసార్లు గర్జించింది వరుసగా.

సైలెన్సర్ అమర్చబడటంవలన చిన్న శబ్దంకూడా వినిపించలేదు.

ఆరు గుళ్ళు సూటిగా కర్తార్ సింగ్ గుండెల్లో దూసుకుపోయాయి. గొంతులోనుండి చావుకేక బయటకు రాకుండానే అతడి ప్రాణాలు అనంత విశ్వంలో కలసి పోయాయి.

వచ్చినంత వేగంగానే, ఆ యువకుడు ఆ గదిలోనుండి అదృశ్యమయ్యాడు.

8

అసహనంగా వాచీ వంక చూశాడు ఒక హైజాకర్.

"ఆరూ....ఏభై."

"ఇంకో గంటసేపు వెయిట్ చేయాలి" అనుకున్నాడతడు విసుగ్గా.

సుమారు రెండుగంటలసేపు అలా నిలబడి వుండటం వలన సన్నగా కాళ్ళు లాగుతున్నాయి వారికి.

'కాని, తప్పదు. ఈ ఫ్లయిట్ ఇక్కడినుండి టేకాఫ్ తీసుకున్నంతవరకూ తమ కీ పాట్లు తప్పవని వారికి తెలుసు.

కార్యసిద్ధికి కావలసింది పట్టుదల, దీక్ష.

వారు తీవ్రవాదులే కావచ్చు. వారు చేస్తున్నది దేశద్రోహమే కావచ్చు. కాని. తమ మతంకోసం, తాము నమ్మిన సిద్ధాంతం కోసం వారు సహిస్తున్న శ్రమా, వారు చూపుతున్న సహనం....నిజంగా ఎన్నదగినవి.

ఒక ఆదర్శం కోసం వారు ప్రాణత్యాగానికి కూడా సిద్ధపడ్డారంటే వారెంత కార్యదీక్షాదక్షులో అర్థం అవుతూంది.

వారిని చూస్తుంటే రంజితకు చిన్నప్పుడు చదువుకున్న రవీంద్రనాథ్ ఠాగూర్ పద్యం గుర్తుకువచ్చింది.

"ఎక్కడ విజ్ఞాన నదము చెడు అలవాట్లనెడి ఎడారి

లోనికి ప్రవహింపవో ....

ఎక్కడ ఈ సమాజము జాతి, కుల, మత, వర్గ భావాలతో ముక్కలు కాదో....

ఆ స్వేచ్ఛా స్వర్గం వైపు....

నా దేశాన్ని నడిపించు భగవాన్ !"

నిజమే. మత విద్వేషమన్న విషబీజం వీరి హృదయాల్లో అంకురించకపోతే, జాగృతమైన ఈ యువశక్తి దేశం కోసం నడుం బిగిస్తే.... ఈ దేశం నిజంగా సస్యశ్యామల మౌతూంది. సుసంపన్నమౌతుంది.

రంజిత మనసులో ఏదో భావ సంచలనం!

నిస్త్రాణగా కుర్చీలో వ్రాలి ఉన్న ప్రయాణీకులలో కొందరు నిద్రపోవడానికి ప్రయత్నిస్తున్నారు. కొందరు భగవంతుని ప్రార్థిస్తున్నారు. మరికొందరు ముక్కులతో ముడుపులతో ఆ దేవుని ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

హైజాకర్లు సిగరెట్లు ముట్టించారు. వారితో పాటుగా జోగీందర్ సింగ్ కూడా.

రంజితలో కూడా టెన్షన్ పెరిగిపోతూంది.

అదే సమయంలో....విమానం క్రింద భాగానికి చేరుకున్నారు కమెండోలు.

పైలట్లు దూకివచ్చిన కాక్‌పిట్‌లోని రహస్య ద్వారం మూసివుండటం గమనించారు వారు.

అక్కడ ఒక బ్యాచ్ వుండిపోయింది.

రెండవ బ్యాచ్ ఎడం రెక్కవైపు కదిలింది రబ్బరు కప్పెలతో నిచ్చెనలను అమర్చుకుంటూ పైకి ప్రాకసాగారువారు.

తలుపు దగ్గర నిలబడివున్న రంజితకు పైకి వస్తున్న

కమెండోలు అస్పష్టంగా కనిపిస్తున్నారు.

సుమారు ఎనిమిది అడుగులు పైకి వచ్చేసారు వారు.

'యింకొక్క ఆరడుగులు....అంతే!' అనుకుంది ఆమె.

అంతవరకూ ఎంతో నిబ్బరంగా వ్యవహరించిన ఆమెలో కూడా టెన్షన్ విపరీతంగా పెరిగిపోసాగింది. అరచేతులకు పడుతున్న చెమటను కర్తావు వ్రాసుకుంది ఆమె.

నెమ్మదిగా, క్యాజువల్ గా ...మరికొంచెం తలుపుకు దగ్గరగా జరిగింది ఆమె. ఆమె ఎడంచేయి మెల్లగా పైకి లేచింది. తలుపుకున్న నాబ్ వైపు మెల్లగా జరుగుతూంది.

కమెండోలు మరింత పైకి వచ్చారు.

సన్నని ఆమె చేతివ్రేళ్ళు డోర్ నాబ్ ను తాకుతున్నాయి. ఆమె ఓరకంట హైజాకర్ల వంక చూసింది.

వారు జోగిందర్ సింగ్ తో కబుర్లలో పడ్డారు.

'చాలు! ఆమాత్రం ఏమరుపాటు చాలు' అనుకుంది ఆమె.

ఆదే సమయంలో....

తలుపులూ, కిటికీలు మూసివేయటంవలన, తాము త్రాగుతున్న సిగరెట్ల పొగ అక్కడే వుండిపోవడాన్ని గమనించాడొక హైజాకర్.

అప్పటికే సిగరెట్ పొగ పడని ఒకరిద్దరు ప్యాసెంజర్లు దగ్గడం ప్రారంభించారు కూడానూ.

అతడు కొద్దిగా ప్రక్కనున్న సీటుమీద నుండి వంగి కిటికీని కొద్దిగా తెరిచాడు.

అతనివంకే ఊపిరి బిగపట్టి చూస్తూంది రంజిత. కిటికీ రెక్కగుండా అతడు కాస్త పైకి చూసి వుంటే పైకి ప్రాకుతున్న కమెండోలు అతడికి కనిపించి వుండేవారు.

"అమ్మయ్య! ఒక గండం గడిచింది" అనుకుంది రంజిత దీర్ఘంగా నిట్టూర్పు విడుస్తూ.

రంజిత అంత బరువుగా నిశ్వసించడం వారికి కొద్దిగా ఆశ్చర్యాన్ని కలిగించింది.

కాని, సిగరెట్ పొగ పడక. ఆమె అంతవరకూ ఊపిరి బిగపట్టింది కాబోలు ననుకున్నారు వారు.

ఇంకొక్క నిముషంలో కమెండోలు తలుపును సమీపిస్తారు. రంజిత క్షణాలను లెక్కిస్తూంది.

కాని....ఇంతలో....

"అమ్మో! వారు ఎలా ప్రాకుతుంటూ వస్తున్నారో" అన్న చిన్నిపాప కంఠం....

ఆ విమానంలో బాంబులా పేలింది.

సాధారణంగా ...బస్సులలో గాని, రైళ్ళలో గాని, విమానాలలో గాని ప్రయాణాలు చేసేటప్పుడు కిటికీం గుండా పైకి చూడటం పిల్లలకు సరదా.

కిటికీ ప్రక్కనే కూర్చున్నా, అంతవరకూ కిటికీ బంధింపబడి వుండటంతో ఎనిమిదేళ్ళ తనూజకు చెప్పలే నంత చిరాకుగా వుండేది.

కిటికీ రెక్క తెరిచిన వెంటనే ఆత్రంగా క్రిందకు చూసింది ఆ చిన్నారిపాప.

మరబొమ్మల్లా పైకి ప్రాకుతుంటూ వస్తున్న కమెండోలు కనిపించారు ఆ పాపకు.

అంతే....!

"అమ్మో! వారు ఎలా ప్రాకుతుంటూ వస్తున్నారో" అంది గట్టిగా.

చిన్నారి తనూజ కంఠం విన్న వెంటనే మెరుపుతీగల్లా రిఫ్లెక్ట్ అయ్యారు ఆ హైజాకర్లు మగ్గురూ.

ఒకడు ఒక్క అంగలో తలుపును సమీపించి, తలుపు దగ్గరున్న రంజితను విసురుగా వెనక్కి లాగాడు. మరొకడు చటుక్కున కిటికీ తలుపులను మూసేసాడు. తలుపులను మూస్తూ ఒక్కసారి క్రిందకు చూశాడు.

ప్రాకుతుంటూ పైకివస్తున్న కమెండోలు కనిపించారతడికి. అతడు గిరుక్కున తనవారి వంక తిరిగాడు.

“కమెండోలు....” అన్నాడతడు.

మూడవ వ్యక్తి....జోగిందర్ సింగ్‌ను తీసుకొని కాక్‌పిట్ లోనికి పరుగెత్తాడు.

ఎయిర్ పోర్ట్ లోని కంట్రోల్ రూమ్‌ను కంటాక్ట్ చేశాడు జోగిందర్ సింగ్.

లైన్ కనెక్ట్ చేయబడ్డాక మైకును తన చేతిలోనికి తీసుకొన్నాడు హైజాకర్.

“ఆఫీసర్స్! కాల్ ద కమెండోస్ బ్యాక్....ఇమ్మీడియట్లీ! ఇఫ్ నాట్ వుయ్ విల్ బ్లాస్ట్ ద ప్లేన్!”— పిచ్చెక్కినట్లు గట్టిగా అర్చాడతడు.

ఎయిర్ పోర్ట్ లలోని అన్ని స్టీరియోలలో ఒకేసారి అతడి గొంతు మార్మోగింది....

....ప్రళయ గర్జనలా!

“ఆఫీసర్స్! నేను చెబుతున్నది వినిపిస్తుందా? కమెండోలను వెనక్కి పిలవండి.

నేను కేవలం పది అంకెలు లెఖ్ఖపెడతాను. ఓన్లీ టెన్ నంబర్స్, అలోగా కమెండోలు వెనక్కి వెళ్ళిపోవాలి. లేకుంటే.... ఈ విమానం ముక్కలయిపోతోంది. వుయ్ బ్లాస్ట్ ఇట్! వందల మంది ప్రయాణీకుల శరీరాలు ముక్కలై ఆకాశంలోకి ఎగిరిపోతాయి. మంటల్లోమాడి,

మసైపోతాయి.

"నేను అంకెలను లెఖ్ఖపెట్టడం ప్రారంభిస్తున్నాను.

ఒకటి.... రెండు... మూడు.... నాలుగు...."

అతడు లెక్కిస్తున్న ఒక్కొక్క అంకె సమ్మెట పోటులా .. అధికారుల కర్ణపుటాలకు తాకుతుంది.

ఆలోచించడానికి కూడా వారికి వ్యవధిలేదు.

ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలి.

ఏమిటి చేయాలి?

391 మంది ప్రయాణీకుల ప్రాణాలతో ఎవరూ ఆడటం ఆడలేరు.

ఒక నిశ్చయానికి వచ్చినట్లు. సి బి ఐ. సీనియర్ ఆఫీసర్ ముందుకు కదిలాడు. లౌడ్ స్పీకర్ను చేతిలోనికి తీసుకున్నాడు.

"కమెండోస్! రిటర్న్ బ్యాక్ ఇమ్మీడియట్లీ. తక్షణం వెనక్కి వచ్చేయండి."

మైకులో అతడి గొంతు కంచులా మ్రోగింది.

రెక్కవైపున్న తలుపును సమీపించబోతున్న కమెండోలు ఆ ఎనౌన్స్మెంట్ను ఆలకించి టక్కున ఆగిపోయారు.

చివరి క్షణంలో ఈ విచిత్రమైన నిర్ణయాన్ని తమ అధికార్లు ఎందుకు తీసుకున్నారో వారికి అర్థం కాలేదు.

ఏది ఏమయినా....

ఏన్ ఆర్డర్ ఈజ్ ఏన్ ఆర్డర్!

అధికారుల ఆజ్ఞ ఉల్లంఘనీయం కాదు కదా! కమెండోలు మౌనంగా వెనుతిరిగారు.

ఎయిర్ పోర్టు వంక మరలిపోతున్న కమెండోల వంక సంతృప్తిగా చూశారు హైజాకర్లు.

కొండంత బరువు గుండెల మీదనుండి దిగినట్లు ఎంతో రిలీఫ్‌గా వుంది వారికి.

రంజితకు నాలుగు కప్పుల టీ తెమ్మని చెప్పాడొకడు ఉల్లాసంగా.

కాక్‌పిట్‌లో....వైర్‌లెస్ సెట్ దగ్గరున్న మూడవ హైజాకర్ ....

'ఇంకొకసారి ఇలాంటి పిచ్చిప్రయత్నం చేస్తే....దాని ఫలితం చాలా తీవ్రంగా వుంటుందని' ఎయిర్‌పోర్టు అధికారులను హెచ్చరించి మరీ విమానంలోనికి వచ్చాడు.

విమానంలోని ప్యాసెంజర్లకు ఏం జరిగిందో అర్థం కాలేదు. ఏదో అసాధ్యమైన సంఘటన సంభవించిందని తెలుస్తూంది. కాని, అదేమిటన్నదే ఎవరికీ తెలియటం లేదు.

వారు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.

ఇక్కడ....ఎయిర్‌పోర్టులో.

అద్భుతమైన తమ ప్లాన్ అలా ఘోరంగా విఫలం కావటంతో....అధికార్లకు పిచ్చెక్కినట్లుంది.

కాలుకాలిన పిల్లుల్లా తిరుగుతున్నారు వారు.

ఏం చేయాలి?

హైజాకర్ల గొంతెమ్మకోర్కెలను తీర్చడమేనా? మరో మార్గమే లేదా?"

టెన్షన్‌తో వారి మెదడులోని నరాలు బ్రద్దలయిపోతాయా అన్నట్లుంది వారి స్థితి.

ఎవరూ, ఏమీ మాట్లాడ్డం లేదు. అంతా నిశ్శబ్దంగా కూర్చున్నారు.

నిశ్శబ్దం!....తుఫాను ముందు ఏర్పడే ప్రశాంతతలాంటి నిశ్శబ్దం!

ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ గోడగడియారం టంగ్ మని ఒక గంట కొట్టింది.

అంతా ఉలిక్కిపడి దానివంక చూశారు.

"ఏడూ.... ముప్పయి!"

అంతే!

వారి ముఖాలు తెల్లగా పాలిపోయాయి. అరచేతులకు పట్టిన చెమటను అప్రయత్నంగానే ట్రౌజర్స్‌కు రుద్దుతున్నారు వారు.

"యింకో ముప్పయి నిముషాలు!" అన్నాడొక అధికారి అసహనంగా.

"య్యాస్....యింకో ముప్పయి నిముషాలలో వారు పెట్టిన గడువు తీరిపోతుంది.

వుయ్ హావ్ నో కార్డ్స్ టు ప్లే!

తప్పదు. తప్పదేమో!

వారి కోర్కెలను అంగీకరించక తప్పదేమో!" బాధగా నిట్టూరుస్తూ అన్నాదు సి.బి.ఐ. అధికారి.

9

"ఇంత బృహత్తర పథకమూ వృధా అయిపోయింది.

మరో అవకాశమే లేదా!

ఈ హైజాకర్ల బారినుండి తప్పించుకొనే మార్గమే లేదా?" రంజిత ఆలోచిస్తున్నది.

"భగవాన్!

కష్టాల్లో వున్నప్పుడే మనిషి నిన్ను తలుస్తాడంటారు. తన స్వార్థం కోసమే నిన్ను కొలుస్తాడంటారు.

అది....నాపట్ల ఎంత నిజమో నాకే తెలియదు. కాని ఉన్నావో, లేవో తెలియని ఓ భగవంతుడా!

ఈ క్షణం నిన్ను చేతులు జోడించి అర్థిస్తున్నాను.

నాకు ఒక్క అవకాశాన్ని కల్పించు.

ఈ బలహీనమైన చేతులకు రవ్వంత శక్తిని ప్రసాదించు తండ్రీ!

అమాయకులైన ఈ ప్రయాణీకుల ప్రాణాలను రక్షించ డంలో.... నా ప్రాణాలు బలైపోయినా పర్వాలేదు. కాని, ఆ రాక్షసుల బారినుండి మాత్రం వీరిని రక్షించు"

పెదవులు విడకున్నా, కన్నులు అరమోడ్పులైనా, కనుపించని ఆ దేవుని మనసులోనే ధ్యానించింది ఆమె.

ఇప్పుడామెలో ఏదో నూతనోత్సాహం. తనపై తనకే కొండంత విశ్వాసం!

ఇక్కడ... దేవుడున్నాడా? లేడా? అన్నది ప్రశ్న కాదు. ఆ చిన్న ప్రార్థన....ఆమెలో అనంతమైన ఆత్మ విశ్వాసాన్ని కల్గించిందంటే....అది నిజంగా గొప్ప విష యమే.

దీనినే ఆత్మశక్తి అన్నారు ఆధ్యాత్మికులు. దైవ కృప అంటారు భక్తులు. సెల్ఫ హిప్నాటిజం అంటారు ఆధు నికులు.

ఉన్నట్లుండి ఆ విమానంలోని లైట్లు చటుక్కున ఆరి పోయాయి. ఎయిర్ కండిషనర్లు ఆగిపోయాయి.

ఒక్క క్షణం తరువాత....

మళ్ళీ మామూలుగా లైట్లు వెలిగాయి. అయితే ఈ సారి ఎయిర్ కండిషనర్లు పనిచేయుడం మానేశాయి.

జరిగిందేమిటో ఎవరికీ అర్థంకాలేదు.

లైట్లు ఆరిపోయినప్పుడు మాత్రం హైజాకర్లు కంగారు పడ్డారు.

'కమెండోలు మళ్ళీ తిరిగి వచ్చారేమోనని' ఆందోళన

చెందారు వారు. కాని, ఆరిపోయినంత వేగంగానే తిరిగి లైట్లు మామూలుగా వెలగటంతో వారిలోని సంశయాలు పటాపంచలయిపోయాయి.

'ఏదో లూజ్ కాంటాక్టయి ఉంటుంది' అనుకున్నారు వారు. ఆగిపోయిన ఎయిర్ కండిషనర్ల గురించికూడా వారు పెద్దగా పట్టించుకోలేదు.

కాని.... జరిగిందేమిటో, లైట్లు ఎందుకలా ఆరి, మళ్ళీ వెలిగాయో, ఎయిర్ కండిషనర్లు ఎందుకు ఆగిపోయాయో.. గ్రహించినది ఒక్క రంజితే!

అఫ్ కోర్స్! ఎయిర్ లైన్స్‌లో పని చేసే వారు మాత్రమే జరిగిందేమిటో పోల్చగలరు.

బోయింగ్ విమానాల్లోని అమరిక ప్రకారం, విమానంలో ఉండే లూబ్రికేషన్ ఆయిల్ గనుక ప్రమాదకరంగా మరీ తక్కువ స్థాయికి చేరుకుంటే, దానికి అనుసంధింపబడి వుండే రెండు సెన్సార్లలో ఏదో ఒకటి టక్కున విమానంలోనికి విద్యుత్ సరఫరాలను ఆపేసి, సూచనను చేస్తుంది.

వెంటనే విమానంలోని లైట్లు ఆరిపోతాయి. ఎయిర్ కండిషనర్లు ఆగిపోతాయి.

అయితే, వెనువెంటనే, బ్యాటరీతో పనిచేసే ఎమర్జన్సీ లైట్లు ఆటోమాటిక్‌గా వెలుగుతాయి.

రంజితకు తెలుసు—బ్యాటరీతో పని చేసే ఆ ఎమర్జన్సీ లైట్లు ఎంతసేపో వుండవని, కొద్దిసేపట్లో ఆరిపోతాయని.

మామూలు పరిస్థితులలో అయితే, కాక్‌పిట్‌లో వుండే పైలట్ ఆ లైట్ల సూచనను గమనించేవాడు. లూబ్రికేషన్ ఆయిల్‌ను రీఫిల్ చేసి, విద్యుత్ సరఫరాను క్రమపరిచేవాడు.

కాని, ఇప్పుడు అవన్నీ చూసేందుకు విమానంలో పైలట్ లేడు. అదృష్టమో, దురదృష్టమో....అవి ఆ పని చేస్తున్నవి వీక్ బ్యాటరీలు. బ్యాటరీలలో పవర్ లేకపోవడంతో లైట్ల వెలుగు క్రమేపీ తగ్గిపోసాగింది.

ఒక్కొక్క క్షణం గడిచేకొద్దీ, లైట్ల కాంతి పూర్తిగా పలుచబడసాగింది.

హైజాకర్లలో కంగారు మొదలయ్యింది.

'ఏమిటి?

ఏమిటి జరుగుతుంది?

లైట్లు ఎందుకిలా కాంతివిహీనాలయిపోతున్నాయి?' - వారికేమి పాలుపోలేదు.

వారు కలవరంగా చుట్టూ చూస్తున్నారు.

తమ తుదిశ్వాస విడుస్తున్నట్లుగా లైట్లు మిణుకు మిణుకు మంటున్నాయి.

అదే సమయంలో రంజిత వారిని సమీపించింది, ఆ హైజాకర్ల వంక చూసిందామె.

ఆ లైట్లు ఇంకొక్క క్షణంలో పూర్తిగా ఆరిపోతాయని ఆమెకు తెలుసు.

ఆమెవంక జోగిందర్ సింగ్ చూసాడు.

కళ్ళతోనే మాట్లాడుకున్నారు వారు.

పరిస్థితి తమ చేజారిపోతున్నదని గ్రహించారు హైజాకర్లు. అకస్మాత్తుగా ఉప్పెనలా ముంచెత్తుకు వచ్చిన చీకటి వారి ధైర్యాన్ని కొద్దిగా సడలించింది.

“ఎక్కడివారు అక్కడే కూర్చోండి. కదలిన సవ్వడి వినిపించినా, నిర్దాక్షిణ్యంగా కాల్చిపారేస్తాం” పిచ్చిగా అరిచాడొక హైజాకర్.

'ఇది కమెండోల పనే!' అనుకున్నారు వారు.

"ఇ మెండోన్! లోపలకు రావడానికి సాహసించ కండి. మీరు మాపై ఎటాక్ ప్రారంభించిన మరుక్షణం.. ఈ విమానాన్ని పేల్చేస్తాం మేం" గట్టిగా అరిచాడు యింకొక హైజాకర్.

అంతలో....

ఎవరో ఉఫ్ అని ఊదేసినట్లు ఆ విమానంలోని లైట్ అన్నీ ఆరిపోయాయి.

చీకటి. కటిక చీకటి.

కళ్ళు చించుకున్నా, ఎవరికీ, ఏమీ కనిపించటంలేదు. ప్రయాణీకులు భయంతో హాహాకారాలు చేయడం ప్రారంభించారు.

ఏడుపులు.... పెడబొబ్బలు.

భయం! బీభత్సం ఒక్కసారిగా స్వైరవిహారం చేశాయి ఆ విమానంలో.

అదే సమయంలో....

తన చేతిలోనున్న ట్రేలోని టీని.... కప్పులతో సహా విసురుగా హైజాకర్ల ముఖాలపై విసిరింది రంజిత.

పొగలు క్రక్కుతున్న వేడి టీ ముఖాన్ని తాకేసరికి బాధగా అర్చారు వారు.

అదేక్షణంలో ఇద్దరు హైజాకర్ల చేతులలోని రివాల్వర్లను ఎగురగొట్టాడు జోగిందర్ సింగ్. ఈలోగా, మూడవ హైజాకర్ పిచ్చివానిలా చీకట్లో కాల్పులు ప్రారంభించాడు.

అది బెరెట్టా రివాల్వర్ కావడంచేత చాలా వేగంగా కాల్పులు జరుపగల్గా డతడు.

వరుసగా మూడురౌండ్లు కాల్చాడతడు.

ఒక గుండు విమానం బాడీకి తగిలింది. ఇంకొక గుండు

ఎదురుగానున్న రంజిత భుజంలో నుండి దూసుకుపోయింది. మూడవవగుండు ఒక ప్యాసెంజర్ చెవిని రాసుకుంటూ సీటును ఛిన్నాభిన్నం చేసింది.

ఒక నిప్పుకణంలా, తుపాకి గుండు భుజంలోనుండి దూసుకుపోగానే, కెవ్వుమని కేక వేస్తూ బోర్లా పడిపోయింది రంజిత.

ఆ పడటం సరిగ్గా కాల్పులు సాగిస్తున్న హైజాకర్ కాళ్ళదగ్గర పడింది ఆమె. యిక తాత్సారం చేయలేదు ఆమె. చటుక్కున అతడి పాదాలను పట్టుకొని బలంగా లాగిందామె.

అంతే! వెల్లకిలా పడిపోయాడతడు. అతడి చేతిలోని రివాల్వర్ దూరంగా తృళ్ళిపోయింది.

ఓ ప్రక్క....

జోగీంధర్ సింగ్ మిగిలిన ఇద్దరు హైజాకర్లతో పెనుగులాడుతున్నాడు.

చీకటిలో ఎవరు, ఎవరిని కొడుతున్నారో, ఎక్కడ కొడుతున్నారో తెలియని పరిస్థితి.

ఓ హైజాకర్ నడుముకున్న బాకును తీశాడు. జోగీందర్ సింగ్ వట్టి చేతులతోనే పోరాడుతున్నాడు.

మా చేయి చీరుకుపోయింది. భుజంపై బలంగా దిగిందొక కత్తిపోటు. పొట్టదగ్గర చర్మం కోసుకుపోయింది. అతడి శరీరం రక్తసిక్తమౌతూంది.

అయినా .... అతడు మొండిగా పోరాడుతూనే వున్నాడు.

యిక్కడ....

క్రిందపడ్డ రంజిత మెల్లగా ప్రాకుతుంటూ తలుపును సమీపించింది. ఆమె చేయి డోర్ నాబ్‌పై పడింది.

అదే సమయంలో వెల్లకిలా పడ్డ మూడవ హైజాకర్ పైకి లేచాడు. తలుపును తెరవబోతున్న రంజిత మీదకు భల్లూకంలా పడ్డాడు. అతడి ఉక్కు కౌగిలిలో ఆమె నలిగిపోతూంది.

ఆమెకు ఊపిరి ఆడటంలేదు. ఒకప్రక్క విపరీతంగా బాధ పెడుతున్న భుజం. అయినా ఎలాగో బాధను పళ్ళ మధ్య బిగపట్టి డోర్ నాబ్‌ను తిప్పింది.

డోర్ తెరుచుకుంది.

అయితే డోర్‌ను ఆనుకొని పెనుగులాడుతున్న రంజిత, ఆ హైజాకరు, ఆ అదటుకు, విమానం రెక్కనుండి క్రిందకు రాలిపోయారు.

పద్నాల్గు అడుగుల ఎత్తునుండి క్రిందకు రాలడంతో రంజితకు స్పృహతప్పింది. హైజాకర్‌కు నడుం విరిగి పోయింది.

రంజిత అదృష్టం....! ముందు హైజాకర్, అతడి మీద రంజిత పడటంతో ఆమెకు ప్రమాదకరమైన దెబ్బ లేమీ తగులలేదు.

మోచేతులు కొట్టుకుపోయాయి, షాక్ వలన స్పృహ తప్పింది అంతే!

కొన్ని నిముషాల క్రితం....

ఎప్పుడయితే విమానంలోని లైట్లు, ఆరి, మళ్ళీ వెలి గాయో, వెలిగిన లైట్లు క్రమేపీ కాంతివిహీనమౌతు న్నాయో! అప్పుడే ఎయిర్ పోర్టులోని అధికారులు జరిగిం దేమిటో గ్రహించారు.

కాసేపట్లో ఏర్పడబోతున్న చీకటిని సద్వినియోగం చేసుకోవాలనుకున్నారు.

కమెండోలు మళ్ళీ రంగంలోనికి దిగారు.

పిల్లుల్లా అడుగులు వేసుకుంటూ, విమానాన్ని చుట్టు ముట్టారు వారు. కొందరు ఎడం రెక్క పైభాగానికి ఎక్కి తలుపుదగ్గర సిద్ధంగా మాటు వేసుకొని కూర్చున్నారు.

ఎప్పుడయితే రంజిత తలుపును తెరిచిందో....మరు క్షణం మెరుపుతీగల్లా వారు లోనికి ప్రవేశించారు. వారి చేతులలోని శక్తివంతమైన టార్చిలైట్ల కాంతి ఒక్కసారిగా విమానంలోనికి ప్రసరించింది.

ఆ కాంతి వెలుగులో....

జోగీందర్ సింగ్ ఒక హైజాకర్‌తో పెనుగులాడుతున్నాడు. రెండవవాడు బాకును ఎత్తి బలంగా అతడి వెన్నులో పొడవబోతున్నాడు.

మరుక్షణం....తన చేతిలోని టార్చ్‌లైటును బలంగా, సూటిగా అతడి చేతికి గురిచూసి విసిరాడొక కమెండో..

హైజాకర్ చేతిలోని కత్తి పడిపోయింది. వెనువెంటనే హైజాకర్లను చుట్టుముట్టారు కమెండోలు.

రంజిత, జోగీందర్ సింగ్....హాస్పిటల్‌లో ఎడ్మిట్ చేయబడ్డారు.

అంతవరకూ శిక్కు అన్న కారణంగా అపార్థం చేసుకొని, ఎంతో క్రూరుడుగా భావిస్తూ వచ్చిన జోగీందర్ సింగే, ప్రాణాలకు తెగించి తమ ప్రాణాలను రక్షించాడన్న నిజం తెలుసుకున్న ప్రయాణీకుల కళ్ళు చెమర్చాయి!

• • •

తెల్లని మల్లెపూవులాంటి హాస్పిటల్ బెడ్‌లపై

బాం దేజ్ లతో పడుకుని వున్నారు రంజిత, జోగిందర్ సింగ్.

వారి వంక ఆర్ద్రంగా చూశాడు సి.బి.ఐ. చీఫ్ కరుణా కర్.

"అమ్మా! రంజితా!

మిమ్మల్నిద్దరినీ ఎలా అభినందించాలో నాకు తెలియటం లేదమ్మా!

ఆడపిల్ల వయినా నీవు చూపిన తెగువ, ధైర్యం...."

"నాదేముంది సర్! ఆ క్రెడిట్ అంతా జోగిందర్ సింగ్ గారిదే. సెలవుమీద యింటికి వెళుతున్న ఆయన ఈ విమానంలోనే ప్రయాణం చేయటం, ఒక ఎయిర్ లైన్స్ పైలట్ గా ఆయన నాకు అంతకుముందే పరిచయస్తులు కావడం....అంతా ఇట్స్ అవర్ లక్!" అంది ఆమె చిన్నగా నవ్వుతూ.

"య్యస్....ఇట్స్ అవర్ లక్ బేబీ!

కొందరు శిక్కులు మతం పేరుతో దేశాన్ని భక్షించ బూనడం, అదే మతానికి చెందిన మీరు ప్రాణాలకు తెగించి మరీ ఈ అమాయకులైన ప్రయాణీకులను రక్షించడం!

చూశారా విచిత్రం!

ఇక్కడ భక్షకులూ, రక్షకులూ....శిక్కులే!" కరుణా కర్ గొంతులో ఏదో విషాదం తొణికిసలాడింది.

అంతవరకూ మౌనంగా ఉన్న జోగిందర్ సింగ్, తన ప్రక్కనున్న టేప్ రికార్డర్ ను ఆన్ చేశాడు.

"హిందూ హై హమ్!

హిందూ హై హమ్!

సారే జహాఁసె అచ్ఛా!

హిందూ సితా హమారా....హమారా!

సారే జహాఁసె అచ్ఛా!"

అది వారి మనసులలోని భావం!

"మతాలు వేరైనా, జాతులు వేరైనా మనమంతా భారతీయులం! యస్ వుయ్ ఆర్ ఇండియన్స్!"

—: అ యి పో యిం ది :—